RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844
డిసెంబర్ : 06 శుక్రవారం సంపుటి : 28 సంచిక : 286



## గిద్దలూరు అటవీ ప్రాంతంలో 18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు

2లో

# కొండ పేట లో కొండెక్కిన దీపం



అగ్ని న్యూస్,గిద్దలూరు (డిసెంబర్ 05):

మనం చూస్తున్న నల్లమల ఫారెస్ట్ అనుకుంటున్నారేమో అసలు కాదు ఊరి బయట సంబంధం లేకుండా బ్రతుకుతున్న గ్రహాంతర వాసులు అనుకుంటున్నారేమో అస్సలు కానే కాదు. గిద్దలూరు పట్టణంలోని కొండ పేట సమీపంలో నిర్మించిన మన జగనన్న కాలనీ దుస్థితి ఇది.పగలైతే రహదారి ఎక్కడ ఉందో అక్కడ నివాసం ఉంటున్న స్థానికులకు తెలియదు.రాత్రి అయితే ఏ విషపు పురుగులు దాడి చేస్తాయో అర్ధమే కాదు. అంతేకాదు విష పురుగులు ఇళ్లల్లో కి వచ్చి ఏకంగా సంసారమే చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. దీంతో దిక్కు తెలియని స్థితిలో

2లో

# అధికారుల నిలువెత్తు నిర్లక్ష్యం



- కరెంట్ షాక్ తో ఇద్దరు కూలీలు మృతి
- అనధికారికంగా సాగుతున్న పనులు

(అగ్ని ప్రతినిధి, మార్కాపురం)

కొనకనమిట్ల మండలం సిద్దవరం శివారు ప్రాంతం లో విద్యుత్ షాక్ తో నాగరాజు (28), రంగారావు (30) అనే కార్మికులు మృతి చెందారు. గురువారం పొలం లో విద్యుత్ తీగలు లాగుతుండగ ఈ ప్రమాదం జరిగింది అని స్థానికులు తెలిపారు. విద్యుత్ సరఫరా కావడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు అని వారు పేర్కొన్నారు. మృతులు పెద్దారవీడు కు చెందిన వారు అని తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అనధికారిక పనులు చేస్తూ...

కొనకనమిట్ల మండలం లో విద్యుత్ షాక్ తో ఇరువురు మృతి చెందడం విద్యుత్ శాఖ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించింది. నిజానికి ఇక్కడ జరుగుతున్న పనులకు అధికారికంగా అనుమతి లేదు. అనధికారికంగా నిర్వహిస్తున్న ఈ పనులు పెద్దారవీడు మండలానికి చెందిన ఓ విద్యుత్ కాంట్రాక్టర్ చేపట్టినట్లు సమాచారం. ఇక్కడి పనులు చేసేందుకే అత ను పెద్దారవీడు నుంచి కూలీలను తీసుకొచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ కనీస జాగ్రత్తలు తీసుకోక పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.విద్యుత్ శాఖ

2లో

# కొత్త గృహాల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోండి..!




## - పిఎం ఏవై అర్బన్ 2.0 పథకం

(అగ్ని ప్రతినిధి, మార్కాపురం)

పి.ఎం.ఏవై అర్బన్ పథకం 2.0 కింద గృహాలు మంజూరు అయ్యాయి. ఈ గృహాలను పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్దిదారుల వివరాలను ఆన్లైన్ చేసేందుకు అనుమతించింది. ఈ పథకం కింద మంజూరైన ఒక్కొక్క గృహానికి 2.50 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందచేస్తారు. 3 లక్షల లోపు సంవత్సర ఆదాయం వున్నవారు ఈ పథకానికి అర్హులు. సొంత స్థలం, తెల్ల రేషన్ కార్డు కలిగి, స్థానికంగా ఆధార్ కార్డు చిరునామా కలిగిన వారు ఈ పథకం కింద కొత్త గృహానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు అని గృహ నిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. బ్యాంకు అకౌంట్, కుటుంబ సభ్యుల ఆదార్ కార్డులు, ఇంటి పట్టా నకలు, రేషన్ కార్డు నకలు,ఆధాయ ధృవీకరణ పత్రం,కుల నిర్ధారణ పత్రం నకల్లతో గృహ నిర్మాణ సంస్థ అధికారుల వద్ద నమోదు చేసుకున్న పిదప అర్హతను బట్టి గృహం మంజూరు చేయటం జరుగుతుంది. ఎన్నో ఏళ్ళుగా స్వంత గృహం లేని వారి ఆశ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకం ద్వారా నెరవేరనుంది.

2లో

# భూ సమస్యల పరిష్కారానికే రెవిన్యూ సదస్సులు




(అగ్ని ప్రతినిధి, ఒంగోలు)

భూ అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవడం తో పాటు, బాధితులకు న్యాయం చేయడం, భూసమస్యల పరిష్కారమే లక్ష్యం గా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. నేటి నుండి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు ఉన్నందున గురువారం ఎం.ఎల్.ఏ.లు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి (కనిగిరి),

2లో

## గిద్దలూరు అటవీ ప్రాంతంలో 18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మొదటి పేజి తరువాయి

అగ్ని న్యూస్,గిద్దలూరు (డిసెంబర్ 05):

గిద్దలూరు అటవీ ప్రాంతంలో 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు సూచనలతో టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో డీఎస్పీ జీ. బాలి రెడ్డి మార్గనిర్దేశం లో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ పీ.నరేష్ టీమ్ కూంబింగ్ నిర్వహించారు. అటవీశాఖ అధికారులు లక్ష్మీ నాయక్, జమాల్ వలి లతో కలసి గిద్దలూరు డివిజన్ చింతలపల్లి వైపుగా కూంబింగ్ చేపట్టారు.అక్కడ కనుమ బావి రస్తా వద్ద కొంతమంది వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని సమీపించే సరికి కొందరు పారిపోగా, ఇద్దరు పట్టుబడ్డారు. పట్టుబడ్డ వారిని ప్రకాశం జిల్లా వాసులుగా గుర్తించారు. ఆ సమీపంలో వెతుకగా 18 ఎర్రచందనం దుంగలు లభించాయి. దుంగల తో పాటు, ఇద్దరు వ్యక్తులను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు.సీఐ సురేష్ కుమార్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కొండ పేట లో కొండెక్కిన దీపం

మొదటి పేజి తరువాయి

ఉండిపోయారు జగనన్న కాలనీ వాసులు. దారి లేకపోయినా పర్వాలేదు రాత్రి అయింతే బయటికి వెళ్లిన వారు ఇంటికి వస్తారు అని గ్యారెంటీ లేదు. కొంచెం కనికరించండి అని కమిషనర్ కు చెప్తే ఏఈ కి ఫోన్ చేయండి అని ఒకరు, ఏఈ నాకు సంబంధం లేదు ఎలక్ట్రీషియన్ లకు చెప్పండి అని మరొకరు. ఇలా అధికారులు ఒకరి మీద ఒకరు సాకులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని, మేము గిద్దలూరు నగర పంచాయతీలో ఉన్నామా లేక నల్లమల అడవిలో ఉన్నామా అర్థం కాక కాలనీ వాసులు లబోదిబోమంటున్నారు.

## అధికారుల నిలువెత్తు నిర్లక్ష్యం

మొదటి పేజి తరువాయి

అధికారుల నిలువెత్తు నిర్లక్ష్యం,కాంట్రాక్టర్ ఉదాసీనత వల్ల రెండు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. చనిపోయిన వ్యక్తుల కుటుంబీకుల రోదనలు మిన్నంటుతున్నాయి. మరి అధికారులు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటారా?మరోసారి ఇలాంటి అనధికారిక కార్యకలాపాలను చేపట్టకుండా కాంట్రాక్టర్లపై ఉక్కు పాదం మోపుతారా? వేచి చూడాల్సిందే!.

పంతులు
మెస్
ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర, మార్కాపురం

## భూ సమస్యల పరిష్కారానికే రెవిన్యూ సదస్సులు

మొదటి పేజి తరువాయి

కందుల నారాయణ రెడ్డి (మార్కాపురం),. తాటిపర్తి చంద్రశేఖర్ (ఎర్రగొండపాలెం), ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ లతో కలిసి జిల్లాలో పరిస్థితిపై ఆయన ప్రకాశం భవనంలో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "మీకోసం" అర్జీలలో 70-90 శాతం రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి వస్తున్నందున వీటికి శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వాస్తవానికి ఈ సదస్సులను ఆగష్టు లోనే నిర్వహించాలనుకున్నప్పటికీ అధికారుల బదిలీలు, వరదల నేపథ్యంలో కొంత ఆలస్యం జరిగిందన్నారు.చుక్కల భూములు, 22(ఏ) జాబితాలోని భూముల పైనా అధికారులు ఈ సందర్భంగా ప్రత్యేక దృష్టి సారిస్తారని ఆయన చెప్పారు. అక్రమ ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లను కూడా ఈ సదస్సుల ద్వారా గుర్తించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పటిష్టమైన "భూ దురాక్రమణ నిరోధక చట్టా"న్ని కూడా రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు.పారదర్శకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే గ్రామాల వారీగా షెడ్యూల్ ఖరారు చేసినందున స్థానికులకు ఆయా అంశాలపై వివిధ ప్రచార సాధనాల ద్వారా అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. ఈ నెల 7వ తేదీన జరిగే "మెగా పేరెంట్-టీచర్" సమావేశాలలో కూడాఏయే గ్రామాలలో ఎప్పుడు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారో షెడ్యూల్ను డిస్ప్లే చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే రెవెన్యూ గ్రామంలో రెండు, మూడు పంచాయతీలు ఉన్నాయని, అలా కాకుండా వాటికి సంబంధించిన రికార్డులను ఆయా పంచాయతీల వారీగా మ్యాపింగ్ చేసే విషయాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా ఈ రెవెన్యూ సదస్సులలో పాల్గొని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో భాగస్వామ్యంకావాలని ఆయన పిలుపునిచ్చారు.కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 826 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, వీటిల్లో రెవెన్యూ సదస్సుల కోసం తహశీల్దార్ ఆధ్వర్యంలో ఒక బృందాన్ని,డిప్యూటి తహశీల్దార్ ఆధ్వర్యంలో మరో బృందాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అదే విధంగా జిల్లాస్థాయి అధికారులను మండలాలకు ప్రత్యేక నోడల్ అధికారులుగా నియమించామన్నారు. ఈ రెవెన్యూ సదస్సులలో అర్జీలు ఇచ్చిన ప్రజలకు అప్పటికప్పుడే రశీదు ఇవ్వడంతో పాటు అదే రోజు ఆ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసేలా అధికారులకు శిక్షణ కూడా ఇచ్చామన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించి రికార్డులలో ఉన్నవివరాలను,వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఉన్న భూముల పరిస్థితిని పరిశీలించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు.జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు చక్కటి అవకాశమన్నారు. అసైన్డ్ భూములు వాస్తవ లబ్ధిదారుల అధీనంలోనే ఉన్నాయో లేవో పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమనిచెప్పారు. ఇదే స్ఫూర్తితో క్షేత్రస్థాయి అధికారులు కూడా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.మార్కాపురం ఎం.ఎల్.ఏ. కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వాస్తవ అసైన్డ్ దారులకు న్యాయం చేయడానికి ఇది చక్కని అవకాశమన్నారు. సత్వర నిర్ణయం తీసుకుని బాధితులకు న్యాయం చేయాల్సి ఉంటుందన్నారు.మార్కాపురం లోని చెన్నకేశవ స్వామి ఆలయ భూములు దేవాదాయ శాఖ అధికారులపర్యవేక్షణ లోపం వలన అక్రమంగా రిజిస్ట్రేషన్ అయ్యాయన్నారు. వీటిపై దృష్టి సారించడంతో పాటు దొంగ పాసు పుస్తకాలు ఇచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.కనిగిరి ఎం.ఎల్.ఏ. ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ గతంలో అవకతవకలకు పాల్పడిన అధికారులను ఈ రెవెన్యూ సదస్సులకు దూరంగా ఉంచాలని సూచించారు. రెవెన్యూ సదస్సులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, స్థానికంగా ఈ సదస్సులు జరిగే రోజున ఉపాధిహామీ పనులు నిర్వహించకుండా ప్రజలందరూ వీటిల్లో పాల్గొనేలా చూడాలని అన్నారు ఎర్రగొండపాలెం ఎం.ఎల్.ఏ. తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ వాస్తవ భూ యజమానులకు, వాస్తవ అసైన్డ్ దారులకు న్యాయం చేసేలా చిత్తశుద్ధితో అధికారులు పనిచేయాలన్నారు.మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో చాలా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. ఒకప్పుడు 14 ఎకరాలు ఉన్న ఊరచెరువు నేడు 7 ఎకరాలకు కుంచించుకుపోయిందని చెప్పారు. ఫలితంగా పారిశుధ్య సమస్యలు వస్తున్నాయన్నారు.ఈ విషయాపై దృష్టి సారించాలనిఆమె సూచించారు.ఎర్రగొండపాలెం నియోజకవర్గ టి.డి.పి. ఇన్చార్జి జి. ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ పుల్లలచెరువు మండలం మానేపల్లిలో కొండపోరంబోకు భూముల ఆక్రమణపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు డి.క్రాంతికుమార్ (వై.సి.పి.), ఆర్. స్వరూప్ (టి.డి.పి.), బి.రాజశేఖర్ (బి.జె.పి), రసూల్ (కాంగ్రెస్), సుదర్శనరావు (ఆప్), టి.వెంకటస్వామి (బి.ఎస్.పి), పలు రైతు సంఘాల నాయకులు, ఎన్.జి.వోల ప్రతినిధులు మాట్లాడుతూ బలహీన వర్గాలకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూముల ఆక్రమణలపైనా, శ్మశాన స్థలాల ఆక్రమణలపైనా దృష్టిసారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. బి.చిన ఓబులేసు, ఒంగోలు ఆర్.డి.ఓ. లక్ష్మీ ప్రసన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :
అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

## సైబర్ నేరాలు డ్రగ్స్ పై అవగాహన అవసరం



### - టు టౌన్ ఎస్సై డాక్టర్ ఎం రాజమోహన్ రావు

అగ్ని న్యూస్,మార్కాపురం(డిసెంబర్ 05) :

విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల పట్ల అవగాహన అవసరం అని మార్కాపురం టు టౌన్ ఎస్ఐ డాక్టర్ రాజమోహన్ రావు అన్నారు. మండలం లోని రాయవరం లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం టూ టౌన్ ఎస్సై డాక్టర్ ఎం. రాజమోహన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు ,ఎక్కువగా జరుగుతున్నాయని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు కాకుండా క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. ప్రధానంగా బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ దుర్వినియోగం, రోడ్డు ప్రమాదాలు, మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు, సంబంధిత చట్టపరమైన హక్కులు, చట్టాలు వంటి అంశాలపై అవగాహనలో భాగంగా విద్యార్థులకు విద్య ద్వారా విజ్ఞానం వస్తుంది,విజ్ఞానం ద్వారా వివేకం వస్తుంది, వివేకం ద్వారా మంచి నడవడిక వస్తుంది, మంచి నడవడిక ద్వారా సమాజంలో ప్రతి వ్యక్తి బాధ్యతగా వ్యవహరిస్తారు అని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జోరు వర్షం లోనూ పారిశుద్ధ్య పనులు..!





### - శభాష్ శానిటరీ ఇన్స్పెక్టర్ అంటున్న జనం

అగ్ని న్యూస్,కనిగిరి(డిసెంబర్ 05) :

కనిగిరి పట్టణంలో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో కాలువలు పొంగి పొర్లడంతో , రహదారులు జలమయం అయ్యాయి. జోరు వర్షం లోనూ శానిటరి ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, పారిశుద్ధ్య కార్మికుల తో కాలువల్లో అడ్డంగా ఉన్న చెత్తను తొలగించి రహదారిపై ఉన్న నీటిని తొలగించారు. వర్షాన్ని లెక్కచేయకుండా అధికారులు కాలువలు శుభ్రం చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణం లోని ఇందిరా కాలనీ,శివ నగర్ లలో వర్షపు నీరు డ్రైనేజీ కాలువల్లో వెళ్ళేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయా కాలనీల్లో వరదనీరు తగ్గుముఖం పట్టింది పారిశుధ్యం పనులను ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ పర్యవేక్షించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్ పనితీరును, ఛైర్మన్ తో పాటు పలువురు పట్టణ ప్రముఖులు ప్రశంశించారు.

## తహశీల్దార్ చిరంజీవి ని అభినందించిన ఎన్జీవో సంఘం నాయకులు



అగ్ని న్యూస్, మార్కాపురం(డిసెంబర్ 05) :

మండల తహసిల్దార్ కె చిరంజీవి ని మార్కాపురం యూనిట్ ఎన్జీవో సంఘం నాయకులు, ఎపి ట్రెజరీ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.విధి నిర్వహణలో సమర్ధవంతంగా పనిచేసి,ఉత్తమ ప్రశంస పత్రాన్ని సబ్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రథమంగా అందుకున్నందున, ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జేఏసీ ఛైర్మన్, తాలూకా యూనిట్ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస శాస్త్రి, కార్యదర్శి వి. శ్రీనివాసులు,సబ్ ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ చేగిరెడ్డి రామచంద్రారెడ్డి , సహాయ ఖజానాధికారి కెనడీ, అసోసియేషన్ ఆఫీస్ బేరర్స్ శ్రీనివాసు, రవి కిరణ్, విజయ కుమారి, సరస్వతి,వడ్లమూడి అంజయ్య, జాయింట్ సెక్రెటరీ ,సబ్ కలెక్టర్ సిసి సుబ్బారావు, డిప్యూటీ తహసిల్దార్ బత్తిన శ్రీనివాస్ ఇతర అధికారులు ఉన్నారు.





## సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన సిఐ సురేష్

అగ్ని న్యూస్,గిద్దలూరు (డిసెంబర్ 05):

మండలం లోని గిద్దలూరు నగర పంచాయితీ లోని స్థానిక సూర్య విద్యా నికేతన్ పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై సిఐ సురేష్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంక్ అధికారులమని చెప్పి అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్ తో జాగ్రత్త వహించాలని, బ్యాంకు ఖాతా ఓటీపీ నంబరు చెప్పరాదని తెలిపారు. మీ తల్లితండ్రులకు ఈ సూచనలు తెలియజేసి వారు సైబర్ నేరాల బారిన పడకుండా చూడాలన్నారు. విద్యార్థినులు సోషల్ మీడియాలో పరిచయమయ్యే అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆడపిల్లలు ఇన్స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్బుక్ ప్రొఫైల్ లకు ఈ ఫోటోలు పెట్ట వద్దన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశాలపై వారికి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. తల్లితండ్రులు మీ గురువులు మీపైఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మన దేశ భవిష్యత్తును చెడగొట్టేందుకు పక్క దేశాలు గంజాయి మత్తు పదార్థాలను సరఫరా చేసి యువతను పాడు చేస్తున్నాయని యువత అటువంటి వాటిని గుర్తించి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ మన దేశానికి ఉపయోగపడేలా యువత బాగా చదువుకోవాలని విద్యార్థులకు సిఐ సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి. బ్రహ్మానంద రెడ్డిపాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



అగ్ని న్యూస్,కొనకనమిట్ల (డిసెంబర్ 05): నేటి నుండి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సుల కి మండల తహసిల్దారు, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ తహసిల్దార్ కార్యాలయం లోని ఇతర సిబ్బంది అందరూ పాల్గొంటారని తహసిల్దార్ సురేష్ తెలిపారు. గ్రామానికి సంబంధించి అటవీ శాఖ, దేవదాయ శాఖ వారు కూడా సదరు గ్రామసభల్లో పాల్గొంటారని తెలిపారు. గ్రామ సభల ముఖ్య ఉద్దేశ్యం రెవిన్యూ డిపార్ట్మెంట్ కు సంబంధించి దారి సమస్యలు గానీ, కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలకు దరఖాస్తు, 1( బి )లో పేరు తప్పులున్న కరెక్షన్ పెట్టుకోవడం గాని, దీర్ఘకాలిక రెవిన్యూ సమస్యలు ఉన్న వాటిని స్వయంగా తహసిల్దార్ టీము పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. షెడ్యూల్ ప్రకారము గ్రామాల్లో పేపర్ ప్రకటన ద్వారా తెలియపరచాలని, తహసిల్దార్ ఆవుల సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు.

## లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు..!



అగ్ని న్యూస్,గిద్దలూరు (డిసెంబర్ 05):

అక్షరాల 12 లక్షల 50 వేల రూపాయల బడ్జెట్ వెచ్చించి మున్సిపాలిటీ పరిధిలో చిన్నపిల్లల కోసం చిల్డ్రన్ పార్క్ నిర్మించారు. అయితే అది ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యానికి అనాధగా మారింది.దీంతో తాగుబోతులకు, మలవిసర్జనకు,నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చిల్డ్రన్ పార్క్ ఎక్కడ ఉంది అని పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గరకొచ్చి అడ్రస్ అడిగితే స్థానికులు చెప్తారు. కాస్తా బాగు చేస్తే జనం సంతోషిస్తారు.

## ఎరక్కపోయి వచ్చారు...ఇరుక్కు పోయారు..!



అగ్ని న్యూస్, గిద్దలూరు (డిసెంబర్ 05):

గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో బంగారు షాపు రోడ్డులో టాటా ఏసీ వాహనం ఇరుక్కుని పోయింది. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. ఈ ఏరియా లో రోడ్డు మీద గుంతలు పడడంతో, తరచుగా వాహనాలు ఇరుక్కు పోవడం, ట్రాఫిక్ జామ్ కావడం షరా మామూలు అయింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.




## సాక్షాత్తు సబ్ కలెక్టర్ అడ్డుకున్నా.. ఆగని రేషన్ దందా!

(అగ్ని ప్రతినిధి, ఒంగోలు)

జిల్లాలో ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంలో రేషన్ దందా యధేచ్ఛగా కొనసాగుతుంది. మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్, వెంటాడి వేటాడి పట్టుకుంటున్నప్పటికీ బియ్యం చోరులు తగ్గేదేలే అంటున్నారు. రాత్రుళ్లు వాహనాల్లో యదేచ్ఛగా బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తూనే ఉన్నారు. మార్కాపురం, గిద్దలూరు,ఎర్రగొండపాలెం కేంద్రాలుగా లక్షల రూపాయల బియ్యం అక్రమంగా సరిహద్దులు దాటుతున్నాయి. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం అక్రమ రేషన్ బియ్యం పై ఉక్కు పాదం మోపుతున్నప్పటికీ, సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అర్ధరాత్రి వెంటాడి వేటాడి పట్టుకుంటున్నప్పటికీ బియ్యం చోరులు మాత్రం తమ పని తాము చేసుకుంటూ ముందుకు దూసుకెళ్తున్నారు.పశ్చిమ ప్రకాశం లోని ఒక పట్టణం లోని ఓ రేషన్ షాప్ నుండి అక్రమంగా రేషన్ బియ్యాన్ని అశోక్ లైలాండ్ వ్యాన్ లో తరలిస్తున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని రేషన్ డీలర్లు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పౌర సరఫరాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి అక్రమంగా తరలిస్తున్న రేషన్ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

# చిన్నపాటి వర్షానికే జలమయమైన రహదారులు



అగ్ని న్యూస్, గిద్దలూరు (డిసెంబర్ 05):

గిద్దలూరు పట్టణంలో గురువారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి కృష్ణ థియేటర్ రాచర్ల రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయి జలమయం అయింది. వర్షపు నీరు మొత్తం రోడ్ల పైన చేరి చెరువు ను తలపించాయి కృష్ణ థియేటర్ దగ్గర నుంచి ఎల్ఐసి ఆఫీస్ వరకు ఇష్టారాజ్యంగా కొంతమంది డ్రైనేజీ కాలువల ఆక్రమించుకొని అక్రమ ర్యాంపు ఏర్పాటు చేయడం వల్ల వర్షపు నీరు వెళ్లడానికి మార్గం లేక నీరు మొత్తం రోడ్లపైకి చేరుతుంది అని తెలుస్తోంది. అక్రమాలు నిర్మించేటప్పుడు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రేక్షక పాత్ర వహించారు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలపై అక్రమాలు మరియు అక్రమ ర్యాంపులను తొలగించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరుచున్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



## - టీడీపీ శ్రేణులతో ఎమ్మెల్యే ముత్తుముల

అగ్ని న్యూస్, గిద్దలూరు (డిసెంబర్ 05):

గిద్దలూరు పట్టణంలోని చీతిరాల కళ్యాణ మండపంలో గురువారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో అర్ధవీడు, కంభం మండలాల నాయకులు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీల లోని నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యి గ్రామంలోని ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జరగవలసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై చర్చించారు. గత వైసీపీ పాలనలో గ్రామాల్లో జరిగిన నష్టాన్ని అధిగమించి గ్రామాల్లో విద్యా, వైద్యం, మౌలిక వసతుల కల్పన దిశగా ఎన్డీయే ప్రభుత్వం అడుగులు వేస్తుందని, గ్రామాల్లో ప్రతి టీడీపీ కార్యకర్త గ్రామ సమస్యలను తన దృష్టికి తీసుకొని రావాలని, ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్ధవీడు, కంభం మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బెల్లం ఊట ధ్వంసం



అగ్ని న్యూస్,పెద్దారవీడు ( డిసెంబర్ 05) :

పెద్దారవీడు ఎస్సై పి అనిల్ కుమార్ నేతృత్వంలో పోలీసులు గురువారం నాటు సారా తయారీలో ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశారు.మండలంలోని కలనూతల గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో నాటు సారాయి తయారు చేస్తున్నారన్న విశ్వసినీయ సమాచారం మేరకు పెద్దారవీడు ఎస్సై, తన సిబ్బందితో పాటు ఎస్బి హెడ్ కానిస్టేబుల్ మాల్యాద్రి తో కలిసి కలనూతల గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో నాటు సారాయికి ఉపయోగించే సుమారు 600 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

# ఉధృతంగా పగిడి వాగు..నిలిచిన రాకపోకలు



అగ్ని న్యూస్, గిద్దలూరు (డిసెంబర్ 05) :

రాచర్ల మండలం లోని పాలకవీడు సోమిదేవిపల్లి గ్రామాల మధ్య ఉన్న పగిడివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా ప్రజలకు ఎలాంటి నష్టం జరగకూడదని జాగ్రత్తలు తీసుకున్నారు. రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు, సోమిదేవిపల్లి పాలకవీడు గ్రామాల మధ్య రాకపోకలు జరగకుండా నిలిపివేశారు. ప్రజలు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.రాత్రి సమయాల్లో రైళ్లు దిగి వచ్చేవారు కానీ,ఆయా గ్రామాల రైతులు కానీ లేదా క్రొత్త వ్యక్తులు కానీ వాగు దాటాలని ప్రయత్నం చేయవద్దని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తోందని ఎలాంటి నష్టం వాటిల్లకూడదని ముందు జాగ్రత్త చర్యగా రోడ్డు బ్లాక్ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.







# కుక్కలు ఉన్నాయి మీ పిక్కలు జాగ్రత్త..!

అగ్ని న్యూస్,మార్కాపురం(డిసెంబర్ 05):

పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధి కుక్కలు వందల సంఖ్యలో ఉన్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. కుక్కలను పట్టుకున్నాం, ప్రజలకు ఇబ్బంది లేదు అంటూ ప్రకటనలు చేశారే కానీ పట్టణంలో ఏ మూల చూసిన కుక్కల గుంపు గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. చెన్నకేశవ నగర్, తర్లుపాడు రోడ్డు ఎంప్లాయిస్ కాలనీ, భగత్ సింగ్ కాలనీ లో అత్యధికంగా వీధి కుక్కలు కనపడుతున్నాయి. బండ్ల మీద వెళ్లే వాహనదారుల వెంటపడి వణికిస్తోన్న కుక్కలను నియంత్రణ చేయాలని జనం కోరుకుంటున్నారు.ఇటీవల కాలంలో ఒక చిన్నారిపై దాడి చేయడంతో పాటు,ఇంటి బయట పార్కు చేసిన వాహనాల సీట్లను కూడా చించి వేస్తున్న కుక్కల గురించి ఎక్కడ చూసినా చర్చ సాగుతుంది. అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారేమో వేచి చూద్దాం.

## జల దిగ్బంధం లో ఆ కాలనీలు!



అగ్ని న్యూస్, గిద్దలూరు (డిసెంబర్ 05):

గిద్దలూరు లో గత మూడు రోజుల నుంచి ఒక మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల వలన పట్టణం లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఎదురుగా గల కాలనీ చుట్టూ వర్షపు నీరు చేరడం వలన నీటి దిగ్బంధం లో కాలనీ ఉండి పోయింది. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడం వలన వర్షపు నీరు ఎటు పోవడానికి వీలు లేక నీరు మొత్తం కాలనీలో నెలలు తరబడి నిలబడి ఉంటుందని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పట్టణంలోని ఆర్టీసీ డిపో బ్యాక్ సైడ్ రెండవ లైన్ ఎదురుగా గల కాలనీ చుట్టూ వర్షపు నీరు చేరడం వలన నీటి దిగ్బంధంలో కాలనీ ఉండిపోయింది.కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వలన వర్షపు నీరు ఎటు పోవడానికి వీలు లేక నీరు మొత్తం కాలనీలో నెలలు తరబడి నిలబడి ఉంటుందని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



## టీడీపీ నేత జవ్వాజి పుట్టిన రోజు సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం




అగ్ని న్యూస్, మార్కాపురం (డిసెంబర్ 05):

తెలుగు దేశం పార్టీ మార్కాపురం మండలం అధ్యక్షుడు జవ్వాజి రామాంజుల రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండలం లోని దరిమడుగు గ్రామంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పార్టీ నాయకులు తెలిపారు. యల్వీ ప్రసాద్ కంటి హాస్పిటల్ మార్కాపురం వారిచే ఉదయం 9:00 గంటల నుంచి దరిమడుగు గ్రామ సచివాలయం నందు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి,శుక్లము, కంటి పొరలు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని దరిమడుగు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ సదవకాశాన్ని ఉపయోగించు కోవాలని గ్రామ టీడీపీ నాయకులు కోరారు.







Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)